
సాక్షి
సంగారెడ్డి
శుక్రవారం । 6 । జూన్ । 2025



అర్ధరాత్రి ఆగడాలకు చెక్

అర్ధరాత్రిళ్లు పార్టీలపేరుతో రోడ్లపై తిరిగే ఆకతాయిలకు ఇకనుంచి పోలీసులు చెక్ పెట్టనున్నారు. వివరాలు 10లో ►



కారు, బైక్ ఢీ..

కొడిపల్లిలో కారు ఢీకొని రెవెన్యూ ఉద్యోగి దుర్మరణం పాలయ్యాడు.

వివరాలు 10లో ►



సుక్కల్ తీర్థ్ పనులు వేగవంతం

ఖేడ్ పరిధిలో ఉన్న సుక్కల్ తీర్థ్ కొత్త చెరువు నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి.

వివరాలు 11లో ►

జిల్లా వ్యవసాయాధికారితో
'సాక్షి' ఫోన్ ఇన్

సంగారెడ్డి జోన్: వానాకాలం సీజన్‌లో పంటల సాగు, విత్తనాల ఎంపిక, తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు ఎరువుల వినియోగం తదితర సందేహాలు తీర్చుకునేందుకు 'సాక్షి' ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్‌తో ఈనెల 6న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 'ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రైతులు ఆయనతో మాట్లాడి తమ సందేహాలను నివృతి చేసుకోవచ్చు.





తేదీ : 06-06-2025
సమయం : ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్లు :
9949992039, 9505872923

ఉల్లాస్‌తో అతివకు అక్షరకాంతి

పొదుపు మహిళలకు చదువులు

- ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్న అధికారులు
- జిల్లాలో 45,352 మంది మహిళా నిరక్షరాస్యులు
- త్వరలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు

సంగారెడ్డి టౌన్ : ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు అంటారు. మహిళల సాధికారితకు, అభివృద్ధికి విద్య ఎంతో దోహదపడుతుంది. అయితే జిల్లాలో మహిళలు మాత్ర అక్షరాస్యతలో వెనుకబడే ఉన్నారు. కనీసం సంతకం కూడా చేయడం రాని వారు లక్షల్లో ఉన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రభుత్వాలు 'న్యూ ఇండియా లిటరసీ'కార్యక్రమం అమలుకు చర్యలు తీసుకుంటుండగా, ముందుగా పొదుపు సంఘాల మహిళల్లో అక్షర కాంతులు నింపాలని నిర్ణయించింది. విద్యాశాఖ సహకారంతో 'సెర్ప్'అధికారులు ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్‌ఇన్ సొసైటీ) పేరిట కార్యచరణను రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఆయా జిల్లాల నుంచి ఏపీడీ, డీపీఎంలకు రాష్ట్రస్థాయి ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించగా జిల్లాలో త్వరలో కార్యక్రమాలు చేపడుతున్నారు.

18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి...

ప్రధానంగా మహిళా సంఘాల సభ్యులపై దృష్టిసారించింది. వారిలో 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యంగా నిర్దేశించారు. జిల్లా డీఆర్డీవో, విద్యాశాఖ అధికారులు సంయుక్తంగా చేపడుతున్న ఉల్లాస్ కార్యక్రమంలో నిరక్షరాస్యులను గుర్తించేందుకు ఇప్పటికే సర్వేను ప్రారంభించారు. ముందుగా గ్రామైఖ్య సంఘాల్లో చదువు రాని వారిని గుర్తిస్తారు. జిల్లాలో ఇప్పటివరకు 45,352 మంది మహిళలను గుర్తించారు. సంఘంలోనే చదువు వచ్చిన వారిని వాలంటీరుగా నియమించి అక్షరాలు నేర్పిస్తారు. జిల్లాలోని ఆయా గ్రామాలలో సర్వే పూర్తి చేసి ఎంతమంది నిరక్షరాస్యులు ఉన్నారని తేల్చనున్నారు. వీరిలో ఐదు మందికి ఒక వాలంటీరును నియమించమన్నారు.

ఆర్డీఓ, విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ

ఉల్లాస్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ కమిటీ ఏర్పాటు చేయనున్నారు. డీఆర్డీవోతోపాటు విద్యాశాఖ అధికారులు పర్యవేక్షిస్తారు. మండల స్థాయిలో ఎంపీడీవో, ఎంఈవో, ఐకేపీ ఏపీఎం , గ్రామస్థాయిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు వీవో అధ్యక్షురాలు, కార్యదర్శి బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ప్రభుత్వం ప్రత్యేక యాప్ తీసుకొచ్చింది. సర్వే వివరాలను అందులో పొందుపరచనున్నారు. పదో తరగతిలోపు మానేసిన వారిని ఓపెన్ పది, పదో తరగతితో ఆపేసిన వారిని ఓపెన్ ఇంటర్ చదివేలా ప్రోత్సహిస్తారు. ఇంటర్ పూర్తిచేసిన వారిని డిగ్రీ చేయించాలని నిర్ణయించారు. ఒకవేళ సంఘాల్లో చదివేవారు లేకపోతే సభ్యుల పిల్లలతో ప్రక్రియను కొనసాగించాలని నిర్ణయించారు. సర్వే పూర్తవగానే వాలంటీర్ల సాయంతో కార్యక్రమం షురూ చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



సర్వే చేస్తున్న సంఘం సభ్యులు

చదువు నేర్చుకుంటాను



చదువు నేర్చుకోలేని పరిస్థితుల్లో ఉన్న నాకు చదువు నేర్పించడానికి జిల్లా మహిళా సంఘం మంచి నిర్ణయం. నాతో పాటు చాలామంది చదువులు రాని వాళ్లం నేర్చుకుంటాం.
–అమృత, ఇస్మాయిల్ ఖాన్ పేట సంఘం సభ్యురాలు

గ్రామంలో మహిళలకు శిక్షణ ఇస్తాం



గ్రామాలలోని చదువురాని మహిళలకు ప్రతీరోజు కొంత సమయం కేటాయించి చదువు నేర్పిస్తాం. చదువుతోపాటు రాయడానికి వచ్చే విధంగా శిక్షణను కల్పిస్తాం. వారి సాధికారతకు నేను కూడా కృషి చేస్తా. –రేణుక, సంగారెడ్డి మహిళా సంఘం

అవగాహన కల్పిస్తున్నాం



మహిళా సంఘంలోని సభ్యులకి నిరక్షరాస్యులకు చదువు చెప్పేందుకు కార్యాచరణ రూపొందించాం. విద్యాశాఖ అధికారులు, డీఆర్డీవో ఆధ్వర్యంలో సమష్టిగా ముందుకు సాగి లక్ష్యాన్ని చేరుకుంటాం. –జంగారెడ్డి, అదనపు డీఆర్డీఓ

భూ భారతితోనే పరిష్కారం

కలెక్టర్ వల్లూరు క్రాంతి



అధికారులతో కలిసి మొక్కనాటి నీరుపోస్తున్న కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టం అమలులో పారదర్శకత, సమర్థత, వేగం తీసుకొచ్చేందుకు విశేష చర్యలు చేపట్టామని కలెక్టర్ క్రాంతి వల్లూరు పేర్కొన్నారు. పటాన్‌చెరు మండలం, క్యాసారం గ్రామంలో గురువారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సులో కలెక్టర్ క్రాంతి పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రామంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ...జిల్లా వ్యాప్తంగా పచ్చదనం పెంపొందించేందు కు విరివిరిగా మొక్కలు నాటాలన్నారు. ప్రజల భూ సమస్యలు తీర్చేది భూ భారతి చట్టమేనని స్పష్టం చేశారు.

నేడు దివ్యాంగుల ప్రజావాణి

సంగారెడ్డి జోన్: నేడు దివ్యాంగులు, వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు నిర్వహించే ఈ ప్రజావాణిలో దివ్యాంగులు తమ సమస్యలు, అవసరాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందవచ్చని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

న్యూస్‌రీల్

భూ సమస్యలను పరిష్కరించుకోవాలి

అదనపు కలెక్టర్ మాధురి



భూ భారతి కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ మాధురి

సంగారెడ్డి టౌన్: భూ సమస్యలను పరిష్కరించుకోవడానికి గ్రామాలలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్ మాధురి పేర్కొన్నారు. సంగారెడ్డి మండలంలోని కులాబ్ గూర్ గ్రామంలో గురువారం భూభారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రైతులు చిన్నపాటి సమస్యలున్నా పరిష్కరించుకోవచ్చని మండల స్థాయి అధికారులందరూ అందుబాటులో ఉంటారని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు, రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

మొదటి అదనపు జిల్లా జడ్జి జయంతి



మొక్కలు నాటుతున్న జడ్జి జయంతి, న్యాయవాదులు

సంగారెడ్డి టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని మొదటి అదనపు జిల్లా జడ్జి జయంతి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కోర్టు ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరంగా రాబోయే తరానికి ఇబ్బంది తలెత్తకుండా చూడాలన్నారు. అడవులను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జిలు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో పాఠ్యపుస్తకాల పంపిణీ



పంపిణీ చేస్తున్న పాఠ్యపుస్తకాలు

నారాయణఖేడ్: ఖేడ్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు గురువారం పాఠ్యపుస్తకాల పంపిణీ చేపట్టారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అనుగుణంగా అవసరమైన పాఠ్యపుస్తకాల్లో 95% వరకు రాగా వాటిని ఖేడ్ జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు ఉంచారు. మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వచ్చి తమ తమ పాఠశాలలకు అవసరమైన పుస్తకాలను తీసుకువెళుతున్నారు. ఈసారి పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేయనున్న నేపథ్యంలో విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

యుద్ధ ట్యాంకులను పరిశీలించిన కేంద్రమంత్రి


కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని ఎద్దు మైలారం ఆయుధ కర్మాగారం (ఓడీఎఫ్)లో యుద్ధ ట్యాంకులను రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేతు పరిశీలించారు. గురువారం సాయంత్రం ఓడీఎఫ్‌ను కేంద్రమంత్రి సందర్శించారు. అనంతరం అక్కడి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓడీఎఫ్‌లో తయారవుతున్న బీఎంపీ 2 యుద్ధ ట్యాంకుల పనితీరును, అక్కడ తయారయ్యే యుద్ధ సామగ్రి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సైన్యానికి అవసరమైతే యుద్ధ ట్యాంకులను అందజేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. బీఎంపీ 2 ట్యాంకును అధికారులతో కలిసి నడిపారు. కార్యక్రమంలో ఎంపీ రఘునందన్‌రావు సీఎండీ సంజయ్ ద్వివేది, డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ ఎస్.ముఖర్జీ, సీజీఎం శివశంకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఓడీఎఫ్‌లో యుద్ధ ట్యాంక్‌పై కూర్చున్న కేంద్రమంత్రి సంజయ్‌సేతు

గోపీనాథ్‌కు ఎమ్మెల్యే గూడెం పరామర్శ

పటాన్‌చెరు: అనారోగ్యంతో గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రస్తుతం ఐసీయూలో చికిత్స జరుగుతోందని..భగవంతుడి కృపతో ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకున్నానన్నారు. త్వరలోనే తిరిగి ప్రజాజీవితంలోకి వస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



ఏఐజీ ఆస్పత్రి వద్ద హరీశ్‌రావుతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

శాశ్వత నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని తండాలు, గ్రామాలతోపాటు ఖేడ్ మున్సిపాలిటీలో శాశ్వతంగా తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. అమృత్ –2 పథకం ద్వారా రూ.13 కోట్లతో చేపట్టే పనుల్లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్ పల్లిలో గురువారం తాగునీటి సరఫరా పైపులైను పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. అంతకుముందు ఖేడ్ మండలం పోతన్‌పల్లి, గునుకులకుంట, మాద్వార్, లింగనాయక్‌పల్లి, లింగాపూర్, హన్మంతరావుపేట, మాద్వార్ తండాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి భూమిపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో 5 వేల వరకు నల్లా కనెక్షన్లు ఉండగా గత పాలకులు 1,200 కనెక్షన్లు మాత్రమే ఉన్నట్లు ప్రతిపాదనలు పంపడం వల్ల అమృత్ పథకంద్వారా రూ.13 కోట్లు మాత్రమే మంజూరయ్యాయన్నారు. అమృత్ –3 పథకంలో భాగంగా నిధుల మంజూరుకోసం ప్రతిపాదనలు పంపుతామన్నారు. గౌరైకల్‌లో డెడికేటెడ్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయించి తాగునీటి సరఫరాకు విద్యుత్ సమస్యలు లేకుండా చేశామన్నారు. ఇళ్లులేని పేదలందరికీ ఇళ్లను మంజూరు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అర్హులైన వారందరికీ ఇందిరమ్మ పథకం కింద ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, హౌసింగ్ డిప్యూటీ ఈఈ సతీశ్‌తివారీ, నాయకులు పండరీరెడ్డి, రమేశ్ చౌహాన్, శంకర్ ముదిరాజ్ పాల్గొన్నారు.



అమృత్ పథకం పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

డ్రాపవుట్స్ లేకుండా చూడాలి

మంత్రి దామోదర రాజనర్సింహ

జహీరాబాద్: స్కూల్ డ్రాపవుట్స్ లేకుండా ప్రతీ ఒక విద్యార్థి పాఠశాలకు వెళ్లి చదువుకునేలా కార్యచరణ చేపడుతున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. జహీరాబాద్‌లో గురువారం ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత విద్య చదువుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. తమ ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వాతావరణ కాలుష్యంతో అనేకమంది కొత్త వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కాలుష్యం వల్ల నేడు ఢిల్లీ మహానగరంలో నివసించలేని పరిస్థితి ఏర్పడిందని, హైదరాబాద్‌లోని చాలా ప్రాంతాల్లో కూడా పొల్యూషన్ రేట్ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు విరుగుడుగా హైదరాబాద్‌లో 30 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

అమీన్‌పూర్ ఇక మహానగరమే

- తాజాగా జానకంపేట, వడకపల్లి గ్రామాలు విలీనం
- రికార్డులు సమర్పించిన పంచాయతీ సిబ్బంది



అమీన్‌పూర్ కమిషనర్ జ్యోతిరెడ్డి సమక్షంలో పంచాయతీల రికార్డులను సమర్పిస్తున్న సిబ్బంది

పటాన్ చెరు: అమీన్‌పూర్ మండల పరిధిలో మిగిలిన రెండు గ్రామాలను కూడా మున్సిపాలిటీ పరిధిలోకి విలీనం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం ఆ రెండు గ్రామాల కార్యదర్శులు సిబ్బంది అందరూ మున్సిపాలిటీకి రికార్డులను సమర్పించారు. ఒకప్పుడు పటాన్‌చెరువు మండలంలో అంతర్భాగంగా ఉన్న అమీన్‌పూర్ 2018 ఆగస్టులో మున్సిపాలిటీగా ఏర్పడింది. ఆ తర్వాత కొత్త మండలాల ఏర్పాటు క్రమంలో పటేల్ గూడ, కిష్టారెడ్డిపేట, వడక్‌పల్లి, జానకంపేట, ఐలాపూర్, ఐలాపూర్ తాండ గ్రామాలను అమీన్‌పూర్‌లో విలీనం చేసి మండలంగా రూపొందించారు. తాజాగా గురువారం అమీన్‌పూర్ మండల పరిషత్ పరిధిలో ఉన్నటువంటి జానకంపేట, వడకపల్లి గ్రామాలు అమీన్‌పూర్ మున్సిపల్ పాలన పరిధిలోకి వచ్చాయి. దీంతో అమీన్పూర్ మండల పరిషత్ కార్యాలయం కార్యకలాపాలు ప్రశ్నార్థకంగా మారాయి. కొన్ని నెలల క్రితం కిష్టారెడ్డిపేట, పటేల్ గూడ, ఐలాపూర్, ఐలాపూర్ తాండ సుల్తాన్పూర్, దాయర, గండిగూడ గ్రామాలను అమీన్‌పూర్ పట్టణంలో విలీనం చేసిన సంగతి తెలిసిందే.

మున్సిపాలిటీ పరిధిలోకి పారిశుద్ధ్య కార్మికులు

అమీన్పూర్ మండల పరిధిలో ఒక్క గ్రామం కూడా జిల్లా పరిషత్ పరిధిలో లేకుండా పోయింది. ఇదే విషయంలో జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా 'సాక్షి'తో మాట్లాడుతూ..మున్సిపల్ పరిధిలోకి విలీనమైన పంచాయితీ కార్యదర్శులను మాత్రమే పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉన్న ఖాళీల్లో భర్తీ చేస్తామన్నారు. ఇక పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, కారోబార్లు మున్సిపాలిటీ పరిధిలోకి వెళ్తారని స్పష్టం చేశారు. జెడ్పీ సీఈఓ జానకిరామ్ మాట్లాడుతూ...అమీన్‌పూర్ ఎంపీడీవో ఆఫీసు పరిధిలోని సిబ్బంది వివరాలను ఉన్నతాధికారులకు పంపించామని వారి ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ పరిధిలోనే ఉన్న ఖాళీల్లో వారిని భర్తీ చేస్తామని వివరించారు. అయితే అమీన్‌పూర్ ఎంపీడీవో ఆఫీస్ కార్యకలాపాలు ముగిసినట్లేనని స్పష్టం చేశారు. అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి 'సాక్షి'తో మాట్లాడుతూ జానకంపేట వడకపల్లి గ్రామాలను మున్సిపాలిటీలో విలీన ప్రక్రియ ముగిసిందన్నారు. ఆ పంచాయతీల రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఉపాధి బకాయిలు చెల్లించండి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ బకాయి డబ్బులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహులు డిమాండ్ చేశారు. ఆ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించి, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ జనార్ధన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వితంతు పింఛన్లకు దరఖాస్తులు చేసిన వారికీ వెంటనే మంజూరు చేయాలని కోరారు. రోజువారీ కూలీ రోజుకు రూ.800లకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఏసోబు, సుశీల, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులోనే ఉండాలి

జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి

హత్నూర(సంగారెడ్డి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని లేకుంటే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని గాయత్రీదేవి అన్నారు . గురువారం మండల కేంద్రమైన హత్నూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గాయత్రీదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించి ప్రసవాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హత్నూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వచ్చేవారం నుంచి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని స్థానిక వైద్యులకు సూచించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులతో వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యం వెంటనే అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యురాలు రజిని, సిబ్బంది ఉన్నారు



హత్నూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన గాయత్రీదేవి

ఇక జోన్‌ల వారీగా పారిశుద్ధ్యం

జనాభా, ఇండ్ల ఆధారంగా విభజన

- మల్టీపర్పస్ వర్కర్లకు బాధ్యతలు
- ఇన్‌చార్జిలుగా వ్యవహరించనున్న కార్యదర్శులు, ఎంపీఓ

సంగారెడ్డి జోన్: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. రోజువారీగా పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపట్టడంతోపాటు పర్యవేక్షణకు ప్రత్యేకంగా జోన్లను ఏర్పాటు చేసింది. ఇంటింటికీ చెత్తసేకరణ, మురికి కాలువల నిర్వహణ, రహదారుల పరిశుభ్రతతో పాటు తడి, పొడి వేరు చేయడం, సేకరణ మరింతగా మెరుగుపరచనున్నారు.

631గ్రామపంచాయతీలు..1,464 జోన్లు

జిల్లాలో 26 మండలాలు ఉండగా 631 గ్రామపంచాయతీలున్నాయి. ఆయా గ్రామ పంచాయతీల్లో 2,32,670 ఇండ్లు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ఇండ్ల సంఖ్య, జననివాసం, మార్కెట్లు, సంస్థలు, వ్యాపార సంస్థల ఆధారంగా జోన్లను ఏర్పాటు చేశారు. ప్రతీ గ్రామపంచాయతీలో రెండు నుంచి ఆరు వరకు విభజించారు. ప్రతీ జోన్‌కు సంబంధిత పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తారు. ప్రతీరోజు ఆ జోన్‌లో చెత్త సేకరణతోపాటు పారిశుద్ధ్య పనులు చేపట్టనున్నారు. ప్రభుత్వం చేపట్టిన పారిశుద్ధ్య జోన్ల ద్వారా మెరుగైన ఫలితాలు రానున్నాయని అధికారులు చెబుతున్నారు.



ప్రత్యేక యాప్‌లో నమోదు

జోన్ల వారీగా ప్రతీరోజు చేపట్టిన పారిశుద్ధ్య పనుల నిర్వహణ తదితర అంశాలను నమోదు చేసేందుకు మానిటరింగ్ యాప్‌లో పంచాయతీ కార్యదర్శి నమోదు చేయాల్సి ఉంటుంది. పారిశుద్ధ్య కార్మికుల హాజరు, సేకరించిన చెత్తను తూకం వేయడం, పారిశుద్ధ్య పనుల ఫొటోలు తదితర వివరాలు పొందుపరచాలి. ఒక గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన జోన్లకు సంబంధిత పంచాయతీ కార్యదర్శి బాధ్యత వహించాల్సి ఉంటుంది. అదేవిధంగా ఎంపీఓ, ఎంపీడీఓ, డీఎల్పీఓ, డీపీఓతో పాటు ఉన్నతాధికారులు పర్యవేక్షించనున్నారు. అయితే జిల్లాలో జోన్లను ఏర్పాటు చేసినప్పటికీ వాటి నిర్వహణ మాత్రం చేపట్టడం లేదు.

క్లుప్తంగా

తల్లీకూతురు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్ : తల్లీకూతురు అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ... అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బంధం కొమ్ము మారుతీహిల్స్‌కు చెందిన సంతోష, ఆరు సంవత్సరాల కూతురు పూజతో కలిసి మే 17న ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదు. అదృశ్యమైన భార్య కూతురి కోసం భర్త తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త కుర్మయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అత్తపై అల్లుడు కత్తితో దాడి

- పోలీసుల అదుపులో నిందితుడు

సంగారెడ్డి క్రైమ్: తన పాప మృతికి కారణం అత్తేనని అల్లుడు దాడి చేసిన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేష్ వివరాల ప్రకారం.. పట్టణంలోని శివాజీ నగర్‌కు చెందిన పోచమల్ల లక్ష్మయ్య, నాగమ్మ దంపతులు. పట్టణంలో చేపలు అమ్ముతూ జీవనం కొనసాగిస్తున్నారు. లక్ష్మయ్యకు, నాగమ్మ రెండవ భార్య. వీరికి నలుగురు కుమారులు. లక్ష్మయ్య మొదటి భార్య కుమార్తెను పట్టణంలోని అదే కాలనీకి చెందిన రమేష్ (29)కి ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి పాప ఉంది. నాలుగు రోజుల క్రితం పాప అనారోగ్యంతో మృతి చెందింది. ఈ నేపథ్యంలో తన పాప మృతికి అత్త కారణమని కోపం పెంచుకున్న రమేష్ పక్కా ప్రణాళికతో గురువారం తెల్లవారుజామున 2గంటల సమయంలో ఇంట్లో ఉన్న అత్తపై కత్తితో దాడి చేశాడు. రక్త స్రావంలో పడిఉన్న ఆమెను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి విద్యార్థి మృతి



అభిలాష్(ఫైల్)

కంది(సంగారెడ్డి): చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో మునిగి విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన కంది మండలం ఆరుట్లలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బేగంపేటకు చెందిన అభిలాష్ (22,) గురువారం మధ్యాహ్నం తన తండ్రి యాదయ్యతో కలిసి చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో చెరువులో దిగిన అభిలాష్ కాళ్లకు నాచు చుట్టుకోవడంతో నీటిలో మునిగిపోయాడు. చెరువులో మునిగిపోతున్న కుమారుడు అభిలాష్‌ను రక్షించేందుకు యాదయ్య చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. నీటిలో మునిగి మృతి చెందిన అభిలాష్ మృతదేహం సాయంత్రం తేలింది. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు కండ్ల ముందే మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



కుమార్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కాట్రియాల గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన డ్యాగల కుమార్ (28) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఎక్కడికో వెళ్లి తిరిగి వచ్చి అర్ధరాత్రి తన ఇంటిముందు అరుగుపై పడుకున్న కుమార్ అస్వస్థతకు గురయ్యాడు. అతని నోటి వెంట రక్తం రావడంతో గమనించిన భార్య స్రవంతి రామాయంపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ప్రేవేట్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. కాగా తన భర్త మృతి అనుమానాస్పదంగా ఉందని కుమార్ భార్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో కాంపౌండర్ మృతి

సదాశివపేట(సంగారెడ్డి): పశువైద్య ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంపౌండర్ గుండెపోటుతో మృతి చెందాడు. మండల పరిధిలోని నందికంది గ్రా మానికి చెందిన నారాయణ(54) పట్టణంలోని పశువైద్య ఆస్పత్రిలో కాంపౌండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం విధులకు హాజరై కుర్చీలో కూర్చొని ఉండగా అకస్మాత్తుగా ఛాతీలో నొప్పి రావడంతో కుప్పకూలిపోయాడు. తోటి సిబ్బంది గమనించి అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. వారు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి మృతి చెందినట్లు నిర్ధారించారు.

తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి

సిద్దిపేటరూరల్: తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని చింతమడక మధిర గ్రామమైన అంకంపేటలో జరిగింది. ఎస్సై అపూర్వరెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ముత్యాల తిరుపతి (55) వ్యవసాయంతో పాటు గొర్రెలను మేపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం గొర్రెలను మేపడానికి పొలం వద్దకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో పక్క పొలంలోని చింత చెట్టుకు ఉన్న తేనెటీగలు అతనిపై దాడి చేసి చేయడంతో కింద పడిపోయాడు. తిరుపతి కొడుకు రాజు వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. అనంతరం పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు.

అర్ధరాత్రి ఆగడాలకు చెక్

ఇకపై ఆకతాయిల పనిపడతాం

- శాంతి భద్రతలు కాపాడేందుకు కృషి
- 24 గంటలు గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు
- పాత నేరస్తులపై పటిష్ట నిఘా



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

సంగారెడ్డి క్రైమ్: పట్టణంలో ఆకతాయిల ఆటలకు ఇకపై పోలీసులు చెక్ పెట్టనున్నారు. అర్ధరాత్రి దొరికితే జైలుకే. జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో ఇప్పటికే అర్ధరాత్రి తర్వాత ప్రధాన రహదారులు, పబ్లిక్ ప్రదేశాల్లో యువకులు బర్త్‌డే అంటూ కొందరు, రెస్టారెంట్‌కి వెళ్తామని మరికొందరు, ఏ పని లేకుండా తిరుగుతున్న వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. శాంతి భద్రతల దృష్ట్యా నిత్యం 24 గంటలు పెట్రోలింగ్ వాహనంతో పాటు, బ్లూ కోర్ట్సు పోలీస్ సిబ్బందితో గస్తీ నిర్వహిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో అర్ధరాత్రి ద్విచక్ర వాహనదారులు, కార్లలో తమ ఇష్టానుసారంగా పబ్లిక్ ప్రదేశాల్లో వ్యవహరిస్తున్న తీరుపై పోలీసులు చర్యలు తీసుకోనున్నారు. స్నేహితులతో కలిసి ఇక ఇష్టం వచ్చినట్లు రోడ్లపై తిరగడం కుదరదు. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. పలు కాలనీల్లో రాత్రి 12 తర్వాత తిరుగుతున్న వారిని పట్టుకుని పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. వారి వద్ద నుంచి ఫింగర్‌ప్రింట్ , సంబంధిత వివరాలు తీసుకుంటున్నారు.

కొన్ని ఘటనలు...

సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఏప్రిల్ 15న అర్ధరాత్రి ఓ కుటుంబం ఇంటికి వెళ్తున్న సమయంలో మార్గమధ్యలో గుర్తుతెలియని యువకులు బైకుపై వచ్చి మహిళతో అసభ్యంగా ప్రవర్తించారు. తన కళ్ల ముందే అడ్డుకోబోయిన భర్తపై తీవ్రంగా దాడి చేశారు.

- కొద్ది నెలల క్రితం మెడికల్ దుకాణాలే లక్ష్యంగా వరుస చోరీలకు పాల్పడుతూ ఓ దొంగ పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేశాడు. ఈ కేసును చాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు ఎట్టకేలకు 20రోజుల్లో నిందితుడిని పట్టుకున్నారు. వరుస చోరీలు పాల్పడుతున్న పాత నేరస్తుడైన ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించి, అరెస్టు చేసి జైలుకు పంపించారు.
- కొంతమంది యువకులు అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత కూడా మహబూబ్ సాగర్ చెరువు కట్టపై, అకారణంగా రోడ్లపై సంచరిస్తూ పోలీసులకు చిక్కుతున్నారు.

ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తే చర్యలే



జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ ఎల్లవేళలా పనిచేస్తూనే ఉంటుంది. అర్ధరాత్రి 12 తర్వాత అనవసరంగా ఎవరైనా పట్టణంలో గాని, రోడ్లపై గాని తిరిగితే కఠిన చర్యలు తప్పవు. మహిళలపై గాని, ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ఎవరైనా ప్రవర్తిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. శాంతి భద్రతల దృష్ట్యా పెట్రోలింగ్‌తో పాటు సిబ్బందితో గస్తీ చేడుతున్నాం.

రమేష్, సంగారెడ్డి పట్టణ సీఐ

పండుగల నేపథ్యంలో

పట్టణంలోని పలు కాలనీల నుంచి అర్ధరాత్రి పోలీసులకు డయల్ 100 ద్వారా ఫిర్యాదులు అధిక మొత్తంలో అందుతున్నాయి. వీటిని నియంత్రించేందుకు పోలీసులు అలాంటి వారిని పట్టుకుని వారి వద్ద నుంచి ఫింగర్ ప్రింట్, వారి వ్యక్తిగత వివరాలు తీసుకొని, వారి తల్లిదండ్రుల ముందు కౌన్సిలింగ్ చేస్తున్నారు. కొందరిని మైనర్లుగా భావించి వదిలేస్తున్నారు. ఇకపై పబ్లిక్ ప్రదేశాల్లో ప్రజలకు ఇబ్బంది కలిగించే యువకుల ఆగడాలకు చెక్ పెట్టడం కోసమే ఇలాంటి చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు చెబుతున్నారు. రానున్న పండుగల నేపథ్యంలో ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రం పరిధిలో ఉన్న పాత నేరస్తులపై కూడా తనిఖీలో భాగంగా వారిపై ప్రత్యేక బృందం నిఘా పెట్టింది.



పాఠశాలలో మొక్క నాటుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

భవిష్యత్‌లో 2800 ఈవీ బస్సులు

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

జహీరాబాద్: భవిష్యత్‌లో కేంద్రం సహకారంతో 2800 పీఎం ఈవీ బస్సులు వస్తున్నాయని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బస్సులు రాగానే ప్రస్తుతం నడుస్తున్న 2500 బస్సులను ఓఆర్ఆర్ అవతలి వైపు ఉన్న గ్రామాలకు నడపుతామని పేర్కొన్నారు. గురువారం జహీరాబాద్‌లో ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సందర్భంగా మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్‌లో కాలుష్య నియంత్రణకు ఎలక్ట్రిక్ బస్సులను నడపనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు నడుపుతామన్నారు. కాలుష్య నియంత్రణకు ఎలక్ట్రిక్ వాహనాల పాలసీ తీసుకువచ్చామన్నారు. లాభాల బాటలో ఆర్టీసీ నడుస్తోందన్నారు. 150 బస్సులు మహిళా సంఘాలకు ఇచ్చామని తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు సంబంధించి పెండింగ్ బిల్లులు, డీఏ, పాత పీఎఫ్‌లతో సహా అన్ని రకాల సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. అనంతరం ఆయన పల్లవి పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. సమావేశంలో ఎంపీ సురేష్ శెట్కార్, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి, పార్లమెంట్ కార్యాలయ ఇన్‌చార్జి జి.శుక్లవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రామకృష్ణకు గ్రీన్ చాంపియన్ అవార్డు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ రాష్ట్ర స్థాయి గ్రీన్ చాంపియన్ అవార్డును అందుకున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ఆయన అవార్డును స్వీకరించారు. వనరుల సద్వినియోగం, పర్యావరణ పరిరక్షణ , పరిసరాల పరిశుభ్రత అంశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ సత్ఫలితాలు సాధించారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం రాష్ట్ర స్థాయి అవార్డును అందజేసింది. ఈ సందర్భంగా రామకృష్ణను జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సెక్టోరియల్ అధికారి వెంకటేశం, ఏఎంఓ బాలయ్య , జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, మండల విద్యాధికారి శంకర్, నోడల్ అధికారి సుధాకర్ అభినందించారు.



హెచ్‌ఎం రామకృష్ణకు అవార్డును అందజేస్తున్న మంత్రి కొండా సురేఖ

కారు, బైక్ ఢీ.. రెవెన్యూ ఉద్యోగి మృతి



షేక్ అబ్దుల్‌నబి(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): ముందు వెళ్తున్న కారు అకస్మాత్తుగా యూటర్న్ తీసుకోవడంతో కారు, బైక్ ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రమైన కౌడిపల్లి శ్రీరేణుక ఎల్లమ్మదేవి ఆలయం సమీపంలో 765డి జాతీయ రహదారిపై గురువారం జరిగింది. స్థానిక ఎస్ఐ రంజిత్‌రెడ్డి వివరాల ప్రకారం.. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్‌నబీ(27) మెదక్ ఆర్డీఓ కార్యాలయంలో ఏడాదిన్నరగా జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగా గురువారం తన బైక్‌పై తిమ్మాపూర్ నుంచి మెదక్ బయలుదేరాడు. కౌడిపల్లి రేణుకాఎల్లమ్మదేవి ఆలయ సమీపంలో ముందు వెళ్తున్న కారు యూటర్న్ తీసుకోవడంతో కారు, బైక్ ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న షేక్ అబ్దుల్‌నబి తలకు తీవ్రగాయాలయ్యాయి. అక్కడే ఉన్న రైతులు గమనించి అదేకారులో కౌడిపల్లి సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి షేక్ సలీమా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అందరితో కలుపుగోలుగా ఉండే షేక్ అబ్దుల్‌నబీ చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి జనవరిలో వివాహం అయింది.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు..



యాదగిరి, మంజుల(ఫైల్)

చేగుంట(తూప్రాన్): శుభ కార్యానికి వెళ్తున్న దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ ఘటన వడియారం శివారులోని బైపాస్ చౌరస్తా వద్ద 44వ జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం ... చేగుంట మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన తీగుళ్ల యాదగిరి (51) చిన్న శంకరంపేటలో ఓ ఫౌల్ట్రీ ఫారంలో కూలి పనులు చేసుకుంటున్నారు. గురువారం తూప్రాన్‌లోని బంధువుల శుభకార్యానికి యాదగిరి, భార్య మంజుల(45) టీవీఎస్ మోపెడ్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో వడియారం బైపాస్ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతున్న వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని హైదరాబాద్ నుంచి రామాయంపేట వైపు వెళ్తున్న మినీవ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. దంపతులకు ఇద్దరు కుమారులు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

డీజే పెట్టేందుకు వెళ్లి.. విద్యుదాఘాతంతో మృతి

ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మృతి



ఉదయ్ కిరణ్

కొల్చారం(నర్సాపూర్): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వరిగుంతం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహమ్మద్ గౌస్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ముత్యంగారి ఉదయ్ కిరణ్ (22) ట్రాక్టర్ మెకానిక్, డీజే సౌండ్ సిస్టంపై పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి మండలంలోని పోతిరెడ్డిపల్లి తండాలో వివాహ వేడుకల్లో డీజే సిస్టం పెట్టేందుకు మరో ఇద్దరు స్నేహితులతో కలిసి వెళ్లారు. సౌండ్ సిస్టంకు అవసరమైన విద్యుత్తును పక్కనే ఉన్న ఇంట్లో నుంచి ఉదయ్ కిరణ్ విద్యుత్ కనెక్షన్ తీసుకుంటుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రసారమైంది. దీంతో కింద పడిపోయాడు. చికిత్స నిమిత్తం మెదక్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు.

మోటర్ వేస్తుండగా రైతు..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మెలగిరిపేట్ శివారులో గురువారం చోటు చేసుకుంది. సీఐ మహేష్ గౌడ్ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పట్లోళ్ల రాజిరెడ్డి(45) ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం తన పొలానికి వెళ్లాడు. మోటర్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం సదాశివపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆయన మృతి చెందాడని వైద్యులు పేర్కొన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

పండ్ల బండిని శుభ్రం చేస్తూ..



కృష్ణప్ప(ఫైల్)

రామచంద్రాపురం(పటాన్ చెరు): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన కే.కృష్ణప్ప (41) జీవనోపాధి కోసం పదేళ్ల క్రితం కొల్లూరు వలసవచ్చాడు. పండ్లరసం బండి నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి ఇంటికి వచ్చిన తరువాత పండ్ల బండిని శుభ్రం చేస్తూ దానికి ఉన్న మోటర్‌ను తీసే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో విద్యుత్ షాక్ తగలడంతో కింద పడిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ముగిసిన చేపల చెరువు పంచాయితీ

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి వల్లూర్ గ్రామంలో చేపల చెరువు పంచాయితీ ముగిసింది. గురువారం గ్రామంలోని చెరువులో మత్స్యసహకార సంఘం సభ్యులు పోలీసుల సంరక్షణ మధ్య చేపలు పట్టుకున్నారు. గత ఏడాది కాలంగా చేపలు పట్టే హక్కు తమకంటే తమకే ఉందని గ్రామస్తులు రెండు వర్గాల మధ్య పలుమార్లు గొడవ ఏర్పడి గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసులు పలుమార్లు గ్రామంలో ఇరువర్గాలను ఒక చోట కూర్చోబెట్టి మాట్లాడారు. చివరికి మత్స్యకారులుగా గుర్తింపు పొందిన సభ్యులు మాత్రమే చేపలు పట్టుకోవాలని పోలీసులు సూచించారు. గురువారం తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐ వెంకటరాజ గౌడ్, ఎస్ఐ అహ్మద్ మోహినోద్దీన్ సిబ్బందితో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా బందోబస్తు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



మృతి చెందిన పాడి ఆవు

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని ధర్మారంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన మురళికి చెందిన పాడి ఆవు రోజు మాదిరిగా మేస్తున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగలడంతో అక్కడిక్కడే మృత్యువాత పడింది. ఉపాధినిచ్చే ఆవు మృత్యువాత పడటంతో సుమారు రూ. 70 వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి

సిద్దిపేటఅర్బన్: బైక్ అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లిలో చోటుచేసుకుంది. సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ అపూర్వరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లికి చెందిన శివరాత్రి బాలకృష్ణ (36) కూలీ పనులు చేస్తుంటారు. రోజులాగే పనికి వెళ్లిన బాలకృష్ణ సిద్దిపేట నుంచి బుధవారం రాత్రి రామచంద్ర నగర్‌కు వస్తుండగా ఒక్కసారిగా బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు అతన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మరణించించారు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు



రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టిన కారు

చిన్నకోడూరు(సిద్దిపేట): కారు అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని రామునిపట్ల శివారులో గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు కారులో పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగే విందుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రామునిపట్ల వద్దకు రాగానే కారు అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని వెంటనే స్థానికులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడికి..



ట్రాక్టర్ కిందపడిన యువకుడిని జేసీబీ సహాయంతో బయటకు తీస్తున్న పోలీసులు

మద్దూరు(హుస్నాబాద్): ట్రాక్టర్ కింద పడి ఓ యువకుడు గాయపడ్డాడు. ఈ ఘటన మండలం లోని లద్నూరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఇర్రి రాకేష్‌రెడ్డి గ్రామంలోని ఎల్లమ్మ చెరువు కట్టపై ట్రాక్టర్‌పై తన వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టడంతో ట్రాక్టర్ కింద రాకేష్ రెడ్డి పడిపోయాడు. గ్రామస్తులు డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు విషయం తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న బ్లూకోల్ట్స్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ దిలీప్ కుమార్,గణేష్ ఎస్ఐ మహబూబ్‌కు సమాచారం అందించారు. పోలీసులు గ్రామస్తులతో కలిసి జేసీబీ సహాయంతో ట్రాక్టర్ క్రింద ఉన్న రాకేష్‌రెడ్డిని వెలికి తీసి చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

డీసీఎంలో పనికి వెళ్లిన యువకుడు మృతి

చిన్నశంకరంపేట(మెదక్): పరిశ్రమ డీసీఎంలో పనికి వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం చిన్నశంకరంపేట మండలం రుద్రారం గ్రామానికి చెందిన చాకలి యాదగిరి(35) సూరారం గ్రామశివారులోని ఫీడ్ కంపెనీకి చెందిన డీసీఎంలో ఫీడ్ లోడ్ తీసుకెళ్తుండగా పనిచేసేందుకు వెళ్లాడు. హైదరాబాద్ పెద్ద అంబర్‌పేట సమీపంలో ఆగి ఉన్న లారీని డీసీఎం ఢీకొట్టడంతో కేబిన్‌లో ఉన్న యాదగిరి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. డీసీఎం డ్రైవర్ పరారీలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పరిశ్రమ వద్దకు చేరుకుని గేట్ ఎదురుగా ఆందోళనకు దిగారు. పరిశ్రమ యాజమాన్యం స్పందించకపోవడంతో మెదక్-చేగుంట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా మృతుడి భార్య మంజుల మాట్లాడుతూ తనకు ముగ్గురు చిన్నపిల్లలు ఉన్నారని, పనికని వెళ్లిన పెద్దదిక్కును కోల్పోయానని, న్యాయం చేయాలని కోరారు. పోలీస్‌లు వారికి సర్ది చెప్పి పరిశ్రమ మేనేజర్‌ను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు రాస్తారోకో విరమించారు.



యాదగిరి(ఫైల్)

మరో ప్రమాదంలో కానిస్టేబుల్‌కు..



కానిస్టేబుల్‌ను అంబులెన్స్‌లో తీసుకెళ్తున్న సిబ్బంది

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో పోలీస్ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన కొండపాక మండలంలోని దుద్దెడ శివారులో గురువారం చోటు చేసుకుంది. కోహెడ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న వేణు ద్విచక్ర వాహనంపై దుద్దెడ శివారులో గల పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పని నిమిత్తం వచ్చారు. తిరుగు ప్రయాణంలో రాజీవ్ రహదారిపై హైదారాబాద్ నుంచి సిద్దిపేట వైపునకు వెళ్తున్న కారు అతి వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. సుమారు 100 మీటర్ల వరకు ద్విచక్ర వాహనాన్ని ఈడ్చుకెళ్లింది. దీంతో వేణుకు గాయాలయ్యాయి. అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నిజాయితీకి నిదర్శనం ఆర్టీసీ ఉద్యోగులు

- బస్సులో ప్రయాణికుడు మరిచిపోయిన నగలు, నగదు అప్పగింత
- ఉద్యోగులను సన్మానించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్



ఆర్టీసీ డిపో మేనేజర్ పవన్, కండక్టర్ ఓంప్రకాష్, డ్రైవర్ సలీంలను సన్మానిస్తున్న ఎండీ సజ్జనార్

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల జీపీపీ(గజ్వేల్-ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహించే ఉద్యోగులు నిజాయితీకి నిదర్శనంగా నిలిచారు. వీరి నిజాయితీని గుర్తించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్ గురువారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులను సన్మానించారు. జీపీపీ ఆర్టీసీ డిపోకు చెందిన (టీజీ 36 జెడ్ 0027)బస్సులో గజ్వేల్ నుంచి భువనగిరి మార్గంలో కండక్టర్ ఓంప్రకాష్, డ్రైవర్ సలీంలు ఈ నెల 2న విధులు నిర్వహించారు. ప్రయాణికుడు యాదగిరి భువనగిరిలో బస్సు ఎక్కి జగదేవ్‌పూర్‌కు టికెట్ తీసుకున్నాడు. రాత్రి ప్యాసింజర్‌లు కూర్చునే సీటుపై ఉన్న లగేజ్ పార్శిల్ రాక్‌లో ఓ బ్యాగ్ ఉండటాన్ని కండక్టర్ ఓంప్రకాష్ గుర్తించాడు. వెంటనే ప్రయాణికులను అడిగి వారి సమక్షంలో ఆ బ్యాగును తెరిచి చూడగా 15తులాల బంగారు నగలు, రూ.మూడున్నర లక్షల నగదును గుర్తించారు. వెంటనే ఆ బ్యాగును జగదేవ్‌పూర్ పోలీసులకు అప్పగించారు. బ్యాగు మరిచిపోయిన ప్రయాణికుడు యాదగిరి అక్కడే ఉండటంతో ఎస్ఐ ఆధ్వర్యంలో టికెట్ ఆధారంగా బ్యాగును అప్పగించారు. కాగా నిజాయితీని చాటుకున్న జీపీపీ ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్‌తో పాటు డిపో మేనేజర్ పవన్‌లను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అభినందించి సన్మానించారు.

తాగడానికి డబ్బులివ్వలేదని భర్త ఆత్మహత్య



యాదగిరి(ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): మద్యం తాగడానికి భార్య డబ్బులు ఇవ్వలేదని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వెల్దుర్తి మండలం శేరీల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజు వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఇక్కిరి స్వరూప, యాదగిరి(41)లు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు. యాదగిరి కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. గత నెల 31న మద్యం తాగడానికి భార్యను డబ్బులు అడుగగా తన వద్ద లేవని పంట డబ్బులు వచ్చిన తరువాత ఇస్తానని చెప్పింది. దీంతో అదేరోజు ఇంటి నుంచి బయటకు వెళ్లి పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మనస్తాపంతో ఉరేసుకొని మహిళ..

సంగారెడ్డి : మనస్తాపంతో ఉరేసుకొని మహిళ మృతి చెందిన ఘటన చౌటకూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పుల్కల్ ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ వివరాల ప్రకారం... అందోల్ మండలం సంగుపేట గ్రామానికి చెందిన కావేరి (23)ను చౌటకూరు గ్రామానికి చెందిన పోచయ్యతో గత సంవత్సరం క్రితం వివాహం జరిపించారు. భర్తతో పాటు అత్తమామలతో కలిసి ఉంటున్నారు. వివాహం అనంతరం మూడు నెలలకే గర్భస్రావం అయింది. అలాగే 15 రోజుల క్రితం మరలా గర్భం దాల్చగా ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి గర్భంలో ఉన్న శిశువుకు హృదయ స్పందన సరిగా లేదని, శిశువును తీసివేయాలని చెప్పారు. భర్త అత్తామామలు ఈ విషయంపై, అలాగే వరకట్నంపై ప్రతిసారి సూటిపోటి మాటలు మాట్లాడేవారని భావించిన కావేరి బుధవారం ఉదయం ఇంట్లోనే ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆమెను భర్త పోచయ్య సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి చనిపోయిందని తెలిపారు. ఈ విషయంపై మృతురాలి తల్లి భూమమ్మ ఫిర్యాదు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించడంతో యువకుడు..

హవేళిఘణాపూర్(మెదక్): చెడు అలవాట్లకు బానిసైన ఓ యువకుడిని ప్రవర్తన మార్చుకోవాలని తల్లి మందలించడంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. సర్దన గ్రామానికి చెందిన ఎండి.సల్మాన్(24) జీవనోపాధి కోసం వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం పనులకు వెళ్లి ఇంటికి వచ్చిన సల్మాన్‌ను తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లోకి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.